## 15. కొడవటిగంటి కుటుంబరావు

కొడవటిగంటి కుటుంబరావు 1908 అక్టోబర్ 28వ తేదీన గుంటూరు జిల్లా తెనాలిలో మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. వారి బావ పిల్లలమర్రి గోపాలకృష్ణయ్య ద్వారా తెలుగు ప్రాచీన సాహిత్య పరిచయం కలిగింది. పాశ్చాత్య సాహిత్య సంపర్కం కూడా ఈ రోజుల్లోనే కలిగింది. 1934లో "యువ" ప్రెస్ స్థాపించారు.అది నష్టం వచ్చి, ఆగిపోయింది. తరువాత 'వీరాభిమన్య' మొదలైన సినిమాలకు రచనలు చేశారు. 1937 లో ఎన్నికల హడావుడి లో పాల్గొన్నారు. తిరిగి యువ ప్రచురణలు ప్రారంభమయ్యాయి. క్రమంగా కథా సంపుటాలను, నవలలను, నాటకాలను రచించారు.

**సాహితీ విశేషాలు:** కుటుంబరావు కలం పట్టే నాటికి భావ కవిత్వం రాజ్యమేలుతోంది. ఆర్థిక సంక్షోభం, పరిశ్రమల విస్తరణ, యజమానుల లాకౌట్లు, కార్మికుల సమ్మెలు, ప్రేమలు-పెళ్ళిళ్ళు, మనిషి ప్రవర్తనలో ఐశ్వర్యం తెచ్చే మార్పు, నాగరికతా విస్తరణలో

మంచిచెడ్డలు మొదలైనవన్నీ కుటుంబరావు రచనల్లో కనిపిస్తాయి.

‘ఎండమావులు’ నవలలో ప్రధాన పాత్ర రంగారావు. రంగారావు కంపోజిటర్ గా పనిచేస్తూ నవలలు రచిస్తూ ఉంటాడు. పెట్టుబడిదారీ సమాజం యొక్క భ్రమల్లో చిక్కుకుంటాడు. తరువాత అతని మనస్తత్వంలో మార్పు వస్తుంది. వాస్తవం గ్రహించి ఎండమావుల్లాంటి జీవితానికి స్వస్తి చెప్పి తిరిగి శ్రమజీవి గా జీవించడానికి సిద్ధమవుతాడు.

‘ పంచకల్యాణి' నవలలో వివాహ వయస్సుకు వచ్చిన ఐదుగురు కన్యల ఆశలు, ఆశయాలకు, సామాజిక వాస్తవాలకు మధ్య సంఘర్షణలో ప్రేమ అందని మ్రానిపండు అవుతుంది. వీరిలో సుశీల ఒకామె.ఆమె తన తల్లి బ్రతుకుని చూస్తూ ఒక నిర్ణయానికి వచ్చింది. తన కన్నా పెద్దవాడు అయినా సరే తనను మర్యాదగా చూసే మగాడు చాలు అనుకొంది . మరో యువతి లక్ష్మి. మంచి చెడులను బేరీజు వేసుకుని చివరికి కమలాకరాన్ని ఎంచుకుంటుంది. ఇంకా ఈ నవలలో లలిత, తాయారు, జానకి

వీరు ముగ్గురు కూడా తమ చుట్టూ ఉన్న స్త్రీలు కుటుంబంలో ఎంత మాత్రం సుఖం అనుభవిస్తున్నారో పరిశీలించి పరిస్థితులకు తగినట్లుగా నిర్ణయాలు తీసుకున్నారు.

20వ శతాబ్దం 60వ దశకం దాకా పురుషుల జీవితాలలో వచ్చిన మార్పులను, సంస్కారాన్ని కుటుంబరావు గుర్తించారు. కుటుంబరావు నవలలన్నింటిలోను పెద్దది, గొప్పదీ అయిన నవల చదువు. సుందరం అనే నాయకుని పాత్ర ఆత్మ చరిత్ర ఈ నవలా. ఆంధ్ర దేశ గ్రామీణ వాతావరణాన్ని,రాజకీయ ఘటనలను కళ్ళకు కడుతుంద. ఇంగ్లీష్ చదువుకు సామాజిక గౌరవం, ఆర్థిక భద్రత ఉన్న కారణంగా మధ్య తరగతికి దాని మీద వ్యామోహం పెరిగింది. ఆ తరగతి లో భాగమైన సీతమ్మ సుందరం తల్లి కొడుకులు. చదువులో సుందరం ఒక్కొక్క మెట్టు పైకెక్కి చాలా నేర్చుకున్నాడు. జాతీయ ఉద్యమం సందర్భంగా జరుగుతున్న సంఘటనలకు పరిణామాలకు సుందరం స్పందించలేదు. మధ్య తరగతి మనస్తత్వానికి ప్రతిబింబంలా నిలిచాడు.

ఈ నవల అప్రెంటిస్ నవల అని కొందరు, ఆత్మకథా నవల అని కొందరు, ప్రాతినిధ్య నవల అని మరికొందరు విశ్లేషించారు. ఉద్యమం నవల అన్నవాళ్ళు ఉన్నారు.

కుటుంబరావు వచన రచన సరళంగా, స్వచ్ఛంగా ఉంటుంది. సమాజ శ్రేయస్సు, మానవత్వం యొక్క మూలాలు కుటుంబరావు గారి నవల లక్షణాలు. కుటుంబరావు గారి నవలల్లో 'వారసత్వం, ఐశ్వర్యం' అనేవి ప్రసిద్ధమైనవి. 'అనామిక, ఆడజన్మ' అనే నవలికలు ప్రసిద్ధ రచనలు.